# ఉత్సాహంగా వన్యప్రాణి వారోత్సవాలు

- అటవీ బాట పడుతున్న విద్యార్థులు, వన్యప్రాణి ప్రేమికులు
- అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

కోటపల్లి, అక్టోబర్ 8 : అటవీ సంపద ప్రాముఖ్యత, వన్య ప్రాణుల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యల కోసం నిర్వహిస్తున్న వన్యప్రాణి వారోత్సవాలు నేటితో ముగియనున్నాయి. ప్రతి సంవత్సరం జూలై 29న అంతర్జాతీయ పులుల దినోత్సవం, అక్టోబర్ 2 నుంచి వన్యప్రాణి వారోత్సవాలను అటవీ శాఖ ఘనంగా నిర్వహిస్తున్నది. వన సంపద, వన్య ప్రాణుల విశిష్టతను చాటేలా ఈ కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. అడవులకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేరాఫ్ అడ్రస్ నిలుస్తున్నది. చుట్టూ గోదావరి, ప్రాణహిత, పెన్‌గంగ నదులతో, వాగులు, వంకలతో వేలాది రకాల చెట్ల జాతులతో, వన్య ప్రాణులతో, పక్షుల సవ్వడితో సందడిగా ఉంటుంది. మంచిర్యాల జిల్లాలో కవ్వాల్‌తో పాటు ప్రాణహిత కృష్ణ జింకల అభయారణ్యంలోని జంతువులు, పక్షులు ప్రకృతి ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. జైపూర్ మండలంలోని శివ్వారం మొసళ్ల సంరక్షణ కేంద్రం, కవ్వాల్ అభయారణ్యంలో రకరకాల పక్షులు ప్రతి ఒక్కరికీ మత్ర ముగ్ధులను చేస్తున్నాయి. వన్యప్రాణుల వేటగాళ్ల ఆగడాల పై ఉక్కు పాదం మోపుతుండడంతో వన్యప్రాణులు స్వేచ్ఛగా అడవుల్లో సంచరిస్తున్నాయి. కుమ్రం భీం జిల్లాలో పావురాల గుట్టపై అంతరించిపోతున్న రాబందుల సంఖ్యను పెంచేందుకు అటవీశాఖ చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. వన్యప్రాణుల కోసం తాగునీటి వసతి కల్పించేందుకు నీటి కుంటలు, సాసర్ పిట్‌ల నిర్మాణం, గడ్డి క్షేత్రాల పెంపకాన్ని అటవీ శాఖ చేపడుతున్నది. దీంతో జింకలు, దుప్పులు, కుందేళ్లు, నీలుగాయి, హైనాలు, కొండ గొర్రె, ముండ్ల పందులు, అడవి పందులు, తోడేళ్లు, చిరుత పులుల సంఖ్య పెరుగుతున్నది. వీటికి తోడు పక్కన ఉన్న మహారాష్ట్ర నుండి కాగజ్‌నగర్, చెన్నూర్ అటవీ డివిజన్‌కు పులులు తరలివస్తూ ఆవాసంగా ఏర్పాటు చేసుకుంటుండడం శుభ పరినామం.



వారోత్సవాల్లో భాగంగా అటవీ, వన్యప్రాణుల సంరక్షణ చర్యలను వివరిస్తున్న ఫారెస్ట్ అధికారులు

### నేటితో ముగియనున్న వన్యప్రాణి వారోత్సవాలు

అటవీ సంపద, వన్యప్రాణుల సంరక్షణ తెలిసేలా అటవీశాఖ నిర్వహిస్తున్న వన్యప్రాణి వారోత్సవాలు నేటితో ముగియనున్నాయి. విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణపై పోటీలను నిర్వహించడంతో పాటు చెన్నూర్ అటవీ డివిజన్ పరిధిలోని శివ్వారం మొసళ్ల సంరక్షణ కేంద్రం, భీమారం మండలంలోని బూర్గుపల్లి అటవీ ప్రాంతంలోని వివిధ రకాల పక్షులను చూసేందుకు విద్యార్థులతో కార్యక్రమాలను నిర్వహించారు.




అటవీ ప్రాంతంలోని గొల్ల వాగును సందర్శించిన అటవీ అధికారులు

### వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు..



చెన్నూర్ రేంజ్‌లో వన్యప్రాణుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యల వల్ల వాటి సంఖ్య రెట్టింపు అవుతున్నది. కోటపల్లి అటవీ ప్రాంతం పులలకు కూడా అవాసంగా మారుతుండడం శుభపరిణామం. వన్య ప్రాణులు సంరక్షణ, అటవీ సంరక్షణ చర్యలపై విద్యార్థులు, పర్యావరణ ప్రేమికులకు అవగాహన కల్పించాం.

**-రవి, రేంజర్, కోటపల్లి**

# ఆడబిడ్డల సంక్షేమానికి సర్కారు కృషి

- క్యాతనపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ జంగం కళ
- బతుకమ్మ చీరెల పంపిణీ

మందమర్రి, అక్టోబర్ 8 : పేదింటి ఆడబిడ్డల ముఖాల్లో సంతోషం నింపేందుకే బతుకమ్మ చీరెలను తెలంగాణ సర్కారు పంపిణీ చేస్తున్నదని క్యాతనపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ జంగం కళ అన్నారు. మందమర్రి, క్యాతనపల్లి మున్సిపాలిటీల్లో బతుకమ్మ చీరెల పంపిణీ ఆదివారం కొనసాగింది. క్యాతనపల్లి మున్సిపాలిటీలో చైర్ పర్సన్ జంగం కళ పంపిణీ చేశారు. అన్ని వార్డుల్లో రేషన్ దుకాణాల వద్ద చీరెలను డీలర్లు, నాయకులు కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

**కోటపల్లి మండలంలో..**

కోటపల్లి, అక్టోబర్ 8 : కోటపల్లి మండలంలోని షట్‌పల్లి, సిర్సాలో మహిళలకు చీరెలను సర్పంచ్‌లు ముల్కల్ల ఉమ, పెద్దింటి పున్నంచంద్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్‌లు గోనె మోహన్ రెడ్డి, చెన్నం వెంకటేశ్, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు, పుప్పాల సతీశ్, గొడిశెల రాజేశ్వర్ రెడ్డి, స్థానిక నాయకులు వేముల రాజం, ఎండీ సలీం, కాపిరపు బాపు, మాదరి సుధాకర్, పుప్పాల బాపు, సుధాకర్, కొట్రంగి మల్లేశ్, బోగె మల్లేశ్, కీర్తి పున్నచంద్, జనగామ తిరుపతి, చిరంజీవి, పూజారి సమ్మయ్య, సీఏ రమాదేవి, రేషన్ డీలర్, సుజాత, సంకీర్త్, గ్రామస్తులున్నారు.



మందమర్రి : క్యాతనపల్లిలో బతుకమ్మ చీరెలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ జంగం కళ

**చెన్నూర్ మండలంలో..**

చెన్నూర్ రూరల్, అక్టోబర్ 8: దుగ్నెపల్లిలో రేషన్ షాపులో మహిళలకు బతుకమ్మ చీరెలను చెన్నూర్ జడ్పీటీసీ మోతె తిరుపతి పంపిణీ చేశారు. సీఎం కేసీఆర్ బతుకమ్మ చీరెలను పంపిణీ చేయడంతో గ్రామాల్లో మహిళలంతా సంతోషంతో ఉన్నారని తెలిపారు. మండలంలోని కొమ్మెర గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు తాళ్లపెల్లి కిరణ్ గౌడ్ ఆధ్వర్యంలో బతుకమ్మ చీరెలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రత్న మంజుల, ఉప సర్పంచ్ గట్టు పద్మ, రేషన్ డీలర్ భూపతి రమాదేవి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కోటపల్లి : షట్‌పల్లి గ్రామంలో బతుకమ్మ చీరెలను పంపిణీ చేస్తున్న సర్పంచ్, నాయకులు



చెన్నూర్ రూరల్ : దుగ్నెపల్లిలో చీరెలను పంపిణీ చేస్తున్న జడ్పీటీసీ మోతె తిరుపతి

## మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కు ప్రభుత్వ విప్, ఎంపీ పరామర్శ



పురాణం సతీశ్ కుమార్‌ను పరామర్శిస్తున్న ప్రభుత్వ విప్, ఎంపీ

కోటపల్లి, అక్టోబర్ 8 : జ్వరంతో బాధపడుతున్న మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్‌ని హైదరాబాద్‌లోని తన స్వగృహంలో ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేతకాని పరామర్శించారు. పురాణం త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. త్వరలో జరగనున్న ఎన్నికలు, చెన్నూర్ నియోజకవర్గ అభివృద్ధిపై ఈ సందర్భంగా ముగ్గురు చర్చించారు.

## క్రీడాకిట్ల పంపిణీ



క్రీడా కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ నగావత్ శ్రీనివాస్

చెన్నూర్ రూరల్, అక్టోబర్ 8: క్రీడాకారులు అన్ని రంగాల్లో రాణించాలని కిష్టంపేట ఎంపీటీసీ నగావత్ శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసిన క్రీడాకిట్లను లంబాడీపల్లిలో ఆదివారం యువకులకు పంపిణీ చేశారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సీఎం కేసీఆర్ ప్రతి గ్రామంలో క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేస్తామని ఎంపీటీసీ తెలిపారు. క్రీడా రంగంలో క్రీడాకారులు అన్ని రకాలుగా ప్రోత్సాహకాలు అందించేందుకు ప్రభుత్వ విప్ ముందు నిలుస్తున్నారని పేర్కొన్నారు. నాగాపూర్, ముత్తరావుపల్లి, ఒత్కులపల్లి గ్రామాల్లో క్రీడా కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచులు లక్ష్మీప్రియ, మాడ సుమలత, అన్నల మానస, అయిత పార్వతి, నాయకులు అన్నల తిరుపతి, మాడ మాధవరెడ్డి, అయిత సురేశ్‌రెడ్డి వార్డు సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

చెన్నూర్ రూరల్, అక్టోబర్ 8: చెన్నూర్ పట్టణంలోని మైనారిటీ ఫంక్షన్ హాల్‌లో 2002-2003 సంవత్సరం 10వ తరగతికి చెందిన పూర్వ విద్యార్థులంతా ఒకే వేదికపై కలుసుకున్నారు. చెన్నూర్ హైస్కూల్‌లో 2002- 2003 సంవత్సరంలో 10 తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు పూర్వవిద్యార్థుల సమ్మేళనం కార్యక్రమం ద్వారా ఒక్కటయ్యారు. ముందుగా వారికి విద్యను బోధించిన గురువును సన్మానించారు. అనంతరం ఒక్కరినొకరు పరిచయం చేసుకుంటూ పాత జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. పూర్వ విద్యార్థులంతా ఒకరికి ఒకరు సహాయం చేసుకొని అండగా నిలవాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో 2002-2003 పదవ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

## గంజాయి విక్రేత అరెస్ట్

గర్మిళ్ల, అక్టోబర్ 8: మంచిర్యాల జిల్లా కేంద్రంలో గంజాయి అక్రమ రవాణా, విక్రయానికి పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పట్టణ ఎస్ఐ రాజేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నస్పూర్‌లోని కృష్ణ కాలనీకి చెందిన పాగిడి శివకృష్ణ మహారాష్ట్రలోని గుర్తు తెలియని వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి మంచిర్యాలకు తీసుకువచ్చి హైటెక్ సిటీ వెనకాల జాఫర్‌నగర్ సమీపంలో 204 గ్రాములు, రూ.5వేల రూపాయలు విలువ చేసే గంజాయి ప్యాకెట్‌ను విక్రయించేందుకు వస్తున్నాడనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. మరో నిందితుడు శ్రీకర్ పోలీసులను పారిపోయాడని, ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.